సాక్షి సిద్దిపేట

సోమవారం । 17 । జూలై । 2023



వేంకటేశ్వరాలయంలో హుండీ చోరీ

కోనాయిపల్లిలోని వేంకటేశ్వరాలయంలోని ఉత్తర ద్వారం నుంచి లోపలికి వచ్చిన దొంగలు హుండీని ఎత్తుకెళ్లారు. సమీపంలోని మామిడి తోటలో దానిని పగులగొట్టారు. 8లో..



'పందిల్ల' వెలవెల

పందిల్ల ప్రాథమిక పాఠశాల నాడు విద్యార్థులతో కళకళలాడింది. నేడు వారి సంఖ్య తగ్గి వెలవెల బోతోంది. రికార్డులో 35 మంది విద్యార్థులు నమోదయ్యారు. కానీ 15 మందే హాజరవుతు న్నట్లు తెలుస్తోంది. 9లో..

నేటి ప్రజావాణి రద్దు

సిద్దిపేటరూరల్: బోనాల పండగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సోమవారం సెలవుదినంగా ప్రకటించిన సందర్భంగా నేడు కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. తిరిగి వచ్చే సోమవారం యథావిధిగా ప్రజావాణి నిర్వహించ నున్నట్లు తెలిపారు.

వైభవంగా బోనాలు



సికింద్లాపూర్‌లో బోనాల ఊరేగింపు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని సికింద్లాపూర్‌లో ఆదివారం భక్తిశ్రద్ధలతో పోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు. డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాల మధ్య మహిళలు బోనమెత్తుకుని ఊరేగింపుగా ఆలయానికి వెళ్లారు. ఆలయం చుట్టూ తిరిగి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా పడి, పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. పూజల్లో సర్పంచ్ జయవర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ బాలయ్య పాల్గొన్నారు.

కిష్టంపేటలో..

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని కిష్టంపేట గ్రామంలో వైభవంగా బోనాలు నిర్వహించారు. ఇంటింటా బోనాలు తీసి పోచమ్మ, పెద్దమ్మలకు నైవేద్యం సమర్పించారు.పిల్లాపాపలను చల్లంగా చూడుతల్లి అంటూ వేడుకున్నారు.



కిష్టంపేటలో బోనాలతో మహిళలు



వర్గల్‌లో పోతరాజుల విన్యాసాలు

న్యూస్‌రీల్

బీఎస్పీతోనే బీసీలకు రాజ్యాధికారం



మాట్లాడుతున్న జక్కని సంజయ్ కుమార్

హుస్నాబాద్: బీసీలకు రాజ్యాధికారం బీఎస్పీతోనే సాధ్యమవుతుందని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు 70 టికెట్లు కేటాయించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జక్కని సంజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలో ఆదివారం బీఎస్పీ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎస్పీ నాయకులను బెదిరింపులకు గురిచేస్తున్న ఎమ్మెల్యే సతీశ్ కుమార్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి బీఎస్పీ అభ్యర్థిని గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎనగందుల శంకర్, వేల్పుల రాజు, పులి నీరజ, పందిపల్లి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల భిక్షాటన



అక్కన్నపేటలో భిక్షాటన చేస్తున్న పంచాయతీ కార్మికులు

అక్కన్నపేట(హుస్నాబాద్): తమ డిమాండ్లను నెరవేర్చాలని గ్రామపంచాయతీ కార్మికులు అక్కన్నపేట మండల కేంద్రంలో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన కార్మికుల సమ్మె ఆదివారం 11వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం దిగివచ్చే వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు వేముగంటి నాయిలు, ప్రధానకార్యదర్శి బండారి రాజేశం, పిట్టల ఆశయ్య, రాజు, బత్తుల శ్రీను, కిరణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని గురువన్నపేట, కొమురవెల్లి, చేర్యాల మండలం నాగపూరి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ కనకయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చేర్యాల మండలం కడవేర్గులో నూతన సబ్‌స్టేషన్‌కు కొత్త లైన్ ఏర్పాటు చేస్తుండటంతో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కరెంట్ ఉండదని తెలిపారు.

విభిన్న ఆలోచనలతో రచనలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విభిన్న ఆలోచనలతో రచనలు కొనసాగించడం హర్షించదగిన విషయమని కథల తాతయ్య, జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షులు ఎన్నవెల్లి రాజమౌళి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ప్రముఖ కవి, రచయిత శ్రీచరణ్ సాయిదాస్ 'దీపావళి' కవితా సంకలనాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉండ్రాళ్ల రాజేశం, శ్రీచరణ్‌సాయిదాస్, లక్ష్మయ్య, బస్వరాజ్‌కుమార్, మహేంద్రరెడ్డి, పర్శరాములు, చంద్రకాంత్, రాములు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న బాలబ్రహ్మం

కొండపాక(గజ్వేల్): మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామ మాజీ సర్పంచ్, దేవాలయ పూజారి బూర్గోజు బాలబ్రహ్మం చార్యులు జ్యోతిష్య వాస్తు పౌరోహిత కళా ప్రపూర్ణ బిరుదు, నంది అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జీసీఎస్ వల్లూరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన అవార్డుల ప్రదానోత్సవంలో బాలబ్రహ్మం ఎంపికయ్యారు. జ్యోతిష్య వాస్తు పురోహితులుగా మన్ననలు పొందిన ఆయనకు ఈ పురస్కారం దక్కింది. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరాజు, ప్రొఫెసర్ కోదండరామ్, తెలంగాణ హౌజింగ్ పోలీస్ కార్పొరేషన్ చైర్మన్ దామోదర్, నిత్యానంద యోగేంద్ర స్వామి పాల్గొన్నారు.

హద్దుల లొల్లి!



కిషన్‌నగర్‌లో హద్దులు మారిన భూమి

- సర్వేయర్లకు దొరకని హద్దురాళ్లు
- ప్లాట్ల కొనుగోలుదారులకు తప్పని పాట్లు
- ఒకే అధికారి రెండు హద్దుల గుర్తింపు
- కొలతలతో రైతులకు చిక్కులు

హుస్నాబాద్‌రూరల్: భూ హద్దుల పంచాయితీలతో ప్లాట్ల కొనుగోలుదారులకు తిప్పలు తప్పడం లేదు. సాగు పనులు మొదలు కాకముందే భూ సర్వే చేయించి హద్దులు పెట్టుకోవాలనుకున్న రైతులకు హద్దు రాళ్లు దొరకక నిరాశే మిగులుతుంది.

హుస్నాబాద్ శివారులోని 292 సర్వే నంబరును రెండేళ్ల కిందట డీఐ సర్వే చేసి హద్దురాళ్లు ఏర్పాటు చేశారు. ఆ భూమిని రైతులు విక్రయించగా కొనుగోలు దారులు దానిని ప్లాట్లుగా మార్చి అమ్మేశారు. పక్కనున్న సర్వే నంబరు 291 భూయజమానులు డీఐతో సర్వే చేయించగా రెండు నంబర్ల సరిహద్దులో 0.30 గుంటల భూమి వ్యత్యాసం వచ్చింది. అక్కడే ఉన్న రైతు.. ఆ రోజు కొలతలు చేసింది మీరే.. ఇప్పుడు చేస్తుంది మీరే.. హద్దులు ఎందుకు తేడా వస్తుందని అని ప్రశ్నించారు. దీనికి డీఐ ఆశ్చర్య పోయి నీకు తెలవదు ఊరుకో.. నేను చూపించేవే హద్దులు అన్నట్లు మాట్లాడటంతో రైతు ముక్కున వేలేసుకున్నాడు.

పాత రికార్డులతో కొత్త చిక్కులు

నిజాం పాలన నాటి రికార్డులనే ఇప్పటికీ అనుసరిస్తుండటంతో సర్వేయర్లకు కొత్త చిక్కులు వచ్చిపడుతున్నాయి. భూ కొలతలకు సంబంధించిన టీపాన్‌లు పూర్తి స్థాయిలో లేకపోవడం, మోకమీద సర్వే నంబర్ల హద్దులను చూపించే హద్దురాళ్లు దొరకకపోవడంతో భూ సర్వే చేస్తే కచ్చితమైన కొలతలు రావడం లేదు. మండల సర్వేయర్ నుంచి కావడం లేదని డీఐకి దరఖాస్తు చేసుకుంటే ఆయన కూడా మండల సర్వేయర్లను అనుసరించే కొలతలు చేస్తున్నారు. మోకమీద హద్దురాళ్లు ఉన్నప్పుడే భూ సర్వేకు సాధ్యమవుతుంది. రైతులు భూములు చదును చేసే సమయంలో హద్దురాళ్లు తొలగిపోవడంతో పంచాయితీలు వస్తున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు భూ సర్వే చేసుకుంటే హద్దులు తేలుతాయని చెప్పడంతో భూయజమానులు సర్వేకు దరఖాస్తు చేసుకుంటూ రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

డీఐ రావడం లేదు

మాకు అవసరం ఉండి అమ్ముకుంటే భూమి తక్కువ ఉందని తేలింది. డీఐకి భూ సర్వే చేయాలని దరఖాస్తు పెట్టాం. రెండేళ్లు గడిచినా భూమి కొలవడానికి డీఐ రావడం లేదు. నెల కిందట కొత్తగా వచ్చిన ఆర్డీవోకు కూడ విన్నవించాం. అయినా రాకుండా కాలయాపన చేస్తున్నారు. ఎప్పుడు అడిగినా వారం ఆగు అంటున్నారు. మా కంటే వెనక దరఖాస్తు పెట్టుకున్న వారి భూమి సర్వే చేశారు. మాది చేయమంటే తిరకాసు పెడుతున్నారు.

– వెంకటేశ్వర్లు, గాంధీనగర్

సమస్యలు పరిష్కరించాలని చెప్పాం



రెండు మండలాలకు ఒకే సర్వేయర్ ఉన్నాడు. అయినప్పటికీ రైతుల దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. గౌరవెల్లి భూ నిర్వాసితుల భూ సర్వేలతో సర్వేయర్‌కు పని భారం పెరిగింది. అయినా రైతుల అర్జీలను పరిశీలించి సర్వే చేసి రిపోర్టు ఇస్తున్నాం. డీఐ దగ్గర ఉన్న దరఖాస్తులను కూడా సర్వే చేయాలని చెప్పాం. హద్దురాళ్లు లేకపోతే సర్వే ఆలస్యం అవుతుంది.

– గయాస్ ఉన్నీసా బేగం, తహసీల్దారు, హుస్నాబాద్

స్థలాల మధ్య వ్యత్యాసం

పట్టణ శివారు విస్తరించింది. శివారు గ్రామాల్లో కూడా అనుమతులు లేని లేఅవుట్లను ఏర్పాటు చేసి ప్లాట్లు విక్రయిస్తున్నారు. ఒక సర్వే నంబరులో ప్లాట్లు చేసినప్పుడు పక్క నంబర్లను కూడ సర్వే చేయించి నాలాకు మార్చాలి. ఆ తర్వాత ప్లాట్లకు అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ రెవెన్యూ అధికారులు అవి ఏవీ చూడకుండా నాలాకు మార్పు చేస్తున్నారు. వెంచర్ యజమానులు ప్లాట్లు కొనుగోలు చేసి ఇష్టానుసారం హద్దురాళ్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో పక్క భూమి యాజమానులు సర్వే చేయించినప్పుడు హద్దులు జరిగినట్లు తేలి స్థల వ్యత్యాసం వచ్చి కొత్త చిక్కులు వస్తున్నాయి. స్థానిక పంచాయతీ, మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారులు సక్రమంగా భూ సర్వే చేసి ప్లాట్లకు అనుమతి ఇస్తే కొనుగోలుదారులకు ఎలాంటి ఇబ్బందులు వచ్చేవి కాదని బాధితులు అభిప్రాయ పడుతున్నారు.

'విద్యుత్‌పై కాంగ్రెస్ నైజం బయట పడింది'



మాట్లాడుతున్న ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్

కొండపాక(గజ్వేల్): విద్యుత్‌పై కాంగ్రెస్ నైజం బయటపడిందని ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ పేర్కొన్నారు. ఆదివారం కుకునూరుపల్లి మండల కేంద్రంలో సర్పంచ్‌లు బచ్చలి మహిపాల్, మల్లమారి రవీందర్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి 3 గంటల విద్యుత్ సరిపోతుందంటూ పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. ఉచిత విద్యుత్ ప్రారంభించింది కాంగ్రెస్సేనంటూ గొప్పలు చెప్పుకుంటున్న అధిష్ఠాన నేతలకు రేవంత్‌రెడ్డి మాటలు వినిపించలేదా అని ప్రశ్నించారు. కొడంగల్ వీరుడు, ధీరుడినంటూ గొప్పలు చెప్పుకున్న రేవంత్‌రెడ్డిని అక్కడి ప్రజలు ఓడించిన విషయం మర్చిపోవద్దన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావులను విమర్శించడం అంటే సూర్యునిపై ఉమ్మేయడమేనన్నారు. రేవంత్‌రెడ్డిని రాజకీయ సమాధి చేసేందుకు రైతాంగం సిద్ధంగా ఉందన్నారు. ముచ్చటగా మూడోసారి కేసీఆర్ సర్కార్ అధికారంలోకి రావడం ఖాయమని, దానిని ఆపడం ఎవరి తరం కాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు కంకణాల మల్లేశం, దేవి నర్సింలు పాల్గొన్నారు.

తెలంగాణలో బీజేపీదే అధికారం



కార్యక్రమంలో ఎమ్మెల్యే రఘునందన్‌రావు తదితరులు

దుబ్బాకటౌన్: తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా దుబ్బాకలోని వైశ్య భవన్‌లో నిర్వహించిన టిఫిన్ బైటాక్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరంకుశ పాలన సాగిస్తూ ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలకు నిధులు మంజూరు చేయడం లేదని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అంబటి బాలేష్ గౌడ్, సుభాష్‌రెడ్డి, మచ్చ శ్రీనివాస్, ఎల్లారెడ్డి, మట్ట మల్లారెడ్డి, సుంకోజి ప్రవీణ్, చింత సంతోష్, రమణారెడ్డి, వెంకట్‌గౌడ్ ఉన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలి

ఎమ్మెల్సీ యాదవరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్‌రూరల్: సమాజాన్ని సన్మార్గంలో నడుపుతూ, సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించే బాధ్యత వేదపండితులదేనని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర దూప దీప నైవేద్య (డీడీఎన్) అర్చక అధ్యక్షులు దౌల్తాబాద్ వాసుదేవ శర్మ అధ్యక్షతన గజ్వేల్‌లోని అయ్యప్ప దేవాలయంలో ఆదివారం ఉమ్మడి మెదక్ జిల్లా అర్చక ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేద పండితులకు సీఎం కేసీఆర్ సముచిత గౌరవం కల్పిస్తున్నారని తెలిపారు. బ్రాహ్మణ పరిషత్ ద్వారా వారికి రూ.5వేల గౌరవ వేతనం అందిస్తూ, పేద బ్రాహ్మణులకు సంక్షేమ పథకాలలో ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. అనంతరం డీడీఎన్ సిద్దిపేట జిల్లా నూతన అధ్యక్షునిగా చాడ నందబాలశర్మ, కార్యదర్శిగా జంగం వీరభద్రయ్య, కోశాధికారిగా రాజమనోహర్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, డీడీఎన్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడి చంద్రశేఖరశర్మ, దేశపతి రాజశేఖరశర్మ, చిదిరె శ్యాంనాథ్‌శర్మ, ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షులు శ్రీనివాసచార్యులు, ప్రతినిధులు విఠాల గోపీకృష్ణమూర్తి శర్మ, ఆంజనేయశర్మ, విఠాల మురళీమోహనశర్మ, బీటుకూరి వాసవాచార్యులు, తిగుళ్ల వేణుశర్మ, విఠాల సాయికృష్ణశర్మ, తనికెళ్ల సంతోష్‌శర్మ, దివాకర్‌శర్మ, బిటుకూరి వరుణాచార్యులు, రఘుశర్మ, శరత్‌శర్మ, సతీష్‌శర్మ, గంగాధర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

'తెరవే' జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ రచయితల వేదిక జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులు కొండి మల్లారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అశోకరాజు సమక్షంలో నిర్వహించిన ఎన్నికలో జిల్లా అధ్యక్షులుగా మహమూద్ పాషా, ఉపాధ్యక్షులు పిల్లి మహేందర్, తాటి కిషన్, ఎలికట్టె అయిలయ్య, ప్రధానకార్యదర్శి స్రవంతి, మహిపాల్, కార్యదర్శులుగా జాలిగామ భానుప్రసాద్‌గౌడ్, పిడిశెట్టి రాజు, గోత్రాల సంతోష్, కోశాధికారిగా మోర మోహన్, కార్యవర్గ సభ్యులుగా కొండపర్తి భాస్కరాచారి, అంకూరి ఉమాశంకర్, మూటకోడూరు సిద్ధయ్య, గౌరవ సలహాదారునిగా వంగర నరసింహారెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కొండి మల్లారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రచయితల వేదిక జీవ నదిలాంటిదని, ఎప్పుడూ సజీవంగా ప్రవహిస్తూనే ఉంటుందన్నారు. తెలంగాణ జీవద్భాషను, కళలు, సంస్కృతిని భావితరాలకు అందించడానికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఉద్యమ కాలం నుంచి నేటివరకు మడమ తిప్పకుండా, తొవ్వ తప్పకుండా, ప్రజాపక్షం వహించి, యావత్ తెలంగాణ ఆదరభిమానాలను చూరగొన్నదన్నారు. తెలంగాణలోని అన్ని జిల్లాశాఖలను పునర్నిర్మించి, త్వరలోనే హైదరాబాదులో పునర్ వైభవ సభ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తెరవే సభ్యులు, కవులు, రచయితలు పాల్గొన్నారు.



నియామక పత్రాన్ని అందిస్తున్న కొండి మల్లారెడ్డి

కొమురవెల్లిలో భక్తుల సందడి



ఆలయ రాజగోపురం ఎదుట భక్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న దేవాలయం ఆదివారం భక్తుల రాకతో సందడిగా మారింది. ఆలయ పరిసరాలు మల్లన్న నామస్మరణతో మారుమోగాయి. స్వామివారిని సుమారు 5 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. తెల్లవారుజాము నుంచి పుష్కరిణిలో స్నానమాచరించిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అభిషేకాలు, పట్నాలు, ఒడిబియ్యం, అర్చనలు, కేశఖండన, గంగిరేణి చెట్టుకు ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కొండపైన రేణుక ఎల్లమ్మ తల్లికి బోనం సమర్పించారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఆలయ ఈవో బాలాజీ, ఏఈవోలు అంజయ్య, శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్ పర్యవేక్షించారు.

వ్యాయామంతో ఆరోగ్యం

సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆరోగ్యమే మహాభాగ్యం, ఆరోగ్యానికి మించిన గొప్ప ఆస్తి లేదని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత అన్నారు. ఆదివారం 'స్వచ్ఛ సిద్దిపేట–ఆరోగ్య సిద్దిపేట'లో భాగంగా పట్టణంలో మహిళలకు, బాలికలకు 3కే రన్ కార్యక్రమాన్ని పోలీస్‌శాఖ, సిద్దిపేట రన్నర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం 5.30గంటలకు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో 3కే రన్ కార్యక్రమాన్ని సీపీ శ్వేత జెండా ఊపి ప్రారంభించారు. ఇక్బాల్‌మీనార్, కాంచీట్ చౌరస్తా, వెంకటేశ్వరస్వామి ఆలయం, కోర్టు ఆవరణ, మీదుగా తిరిగి బాలికల ఉన్నత పాఠశాల వరకు రన్ కొనసాగింది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు చొరవతో రంగనాయక సాగర్‌పై ఆగస్టు 6న హాఫ్ మారథాన్ రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సిద్దిపేట, పరిసర ప్రాంతాల ప్రజలు, యువతీ యువకులు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. హాఫ్ మారథాన్‌లో భాగంగానే 3కే ప్రమోషనల్ రన్ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం హైదరాబాద్ అథ్లెటిక్ కోచ్ నిరంజన్ మహిళలకు, బాలికలకు రన్ ప్రాక్టీస్ చేయించారు. అలాగే వార్మప్ ఎలా చేయాలో 5కే, 10కే, 21కే, ఎలా పూర్తి చేయాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రఘుపతి రెడ్డి, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, కౌన్సిలర్ పూర్ణిమ, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్‌లు సుజాత, సువర్ణ మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ, సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కత్తుల బాపురెడ్డి, కార్యవర్గ సభ్యులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



3కే రన్‌లో సీపీ శ్వేత, మహిళలు, బాలికలు



వార్మప్ చేస్తున్న మహిళలు, బాలికలు

క్లుప్తంగా

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

జిన్నారం(పటాన్‌చెరు): ఖాజీపల్లి గ్రామ శివారులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు ఆదివారం గుర్తించారు. వివరాలు ఇలా ఉన్నాయి..మండలంలోని ఖాజీపల్లి గ్రామశివారులోని ఇటుక బట్టీ సమీపంలో ఓ వ్యక్తి మృతి చెందిన విషయాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారాన్ని చేరవేశారు. దీంతో సంఘటనా స్థలాన్ని సీఐ నయీముద్దీన్ సందర్శించారు. సుమారు 35ఏళ్ల వయస్సు మృతదేహం లభ్యమైనట్లు చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేపు పాత సామగ్రి వేలం


ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: పోలీస్ శాఖలో నిరుపయోగంగా ఉన్న పాత సామగ్రిని వేలం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న ఉదయం 10 గంటలకు జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్ ఆవరణలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వేలంలో షామియానాలు, టెంట్లు, డ్రాగన్ లైట్స్, హెల్మెట్స్, కంప్యూటర్ విడి భాగాలు ఉన్నాయని వివరించారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఆర్ఐ అచ్యుతరావు 8712657911, నాగరాజు 8712573037ను సంప్రదించాలని పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కోహీర్(జహీరాబాద్): చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కోహీర్ మండలంలోని మాచిరెడ్డిపల్లి గ్రామంలో చోటు చేసుకొంది. ఏఎస్ఐ కిష్టయ్య తెలిపిన వివరాల ప్రకారం..మృతుడు పసస్తపురం అశోక్(50) జహీరాబాద్ మండలంలోని చిన్న హైదరాబాద్ నివాసి. అశోక్ మండలంలోని మాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. తన అత్తగారింటికి వచ్చిన అశోక్ భార్యతో గొడవపడి శనివారం ఉదయం తాగిన మైకంలో పురుగుల మందు తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. భార్య లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఏడిండ్లలో చోరీ

చేర్యాల(సిద్దిపేట): కొమురవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దరాజుపేట గ్రామంలో ఏడిండ్లలో చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన ఎం.అశోక్, బి.అండాలు, బి.బాలవ్వ, ఎం.నర్సయ్య, రామవ్వ, ముజీం, ఎ.నర్సింగరావుకు చెందిన ఇండ్లల్లో చోరీ జరిగిందని పేర్కొన్నారు. బోనాల సందర్భంగా, ఇద్దరు కూలీలు పనుల కోసం హైదరాబాద్ వెళ్లినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. మరో రెండిండ్లు శిథిలావస్థలో ఉండడంతో వారు స్థానికంగా వేరే ఇంట్లో ఉంటున్నారు. ఈ విషయాన్ని స్థానికులు శనివారం రాత్రి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కొమురవెల్లి ఎస్ఐ చంద్రమోహన్ గ్రామానికి వెళ్లి చోరీ జరిగిన ఇండ్లను పరిశీలించారు.

మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: ఫుడ్ కోర్ట్ వ్యాపారంలో నష్టం వచ్చిందని ఓ వ్యక్తి మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ కిష్టారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..ఏపీలోని కృష్ణా జిల్లా, నూజివీడుకు చెందిన వెంకట కృష్ణ రమకాంత్(41), భార్య స్వాతితో బతుకుదెరువు కోసం వచ్చారు. వారు అమీన్‌పూర్, భవానీ పురం కాలనీలో నివాసం ఉంటున్నారు. పది రోజుల క్రితం రమకాంత్ అతడి భార్యతో కలిసి నవ్య రోడ్డులో ఫుడ్ కోర్ట్ ప్రారంభించారు. వర్కర్లు లేకపోవడంతో, పెట్టిన ఫుడ్ కోర్ట్ సరిగ్గా నడవడం లేదని బాధపడుతుండేవాడు. నాలుగు రోజుల క్రితం భార్య నూజివీడుకు వెళ్లింది. ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న రమకాంత్ తన సోదరికి ఫోన్ చేసి వ్యాపారంలో నష్టం వచ్చిందని చెప్పి ఆవేదన వ్యక్తం చేశాడు. ఆదివారం అతని సోదరి ఫోన్ చేయగా తీయలేదు. దీంతో ఆందోళనకు గురైన ఆమె బంధువులకు ఫోన్ చేసి తమ్ముడు ఫోన్ తీయడం లేదని వెళ్లి చూడమని చెప్పింది. బంధువుల ఇంటికి వెళ్లి చూడగా ఇంట్లో ఉరి వేసుకొని రమకాంత్ కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

పంట మార్పిడి అంతంతే..!


నాట్లేసేందుకు సిద్ధమవుతున్న తుకం

- వేయని భూసారానికి తగ్గ పంటలు
- అధికారుల మాటలు పట్టించుకోని రైతులు
- వరి వైపునకే రైతుల మొగ్గు

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతన్నలు ఎక్కువగా వరి పంట వైపు మొగ్గు చూపుతున్నారు. ఇతర పంటల సాగుపై దృష్టి సారించడం లేదు. అన్ని రకాల పంట సాగు చేసిన రైతులు సైతం ఎక్కువగా వరి పంట సాగుకే దృష్టి పెడుతున్నారు.

☛ తరుచుగా రైతులు వరిసాగు చేయడంతోనే భూసారం తగ్గుతుంది. ఈ క్రమంలో పంట దిగుబడి అటుంచితే, మాములు దిగుబడికే అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

☛ చిలప్‌చెడ్ మండలం ఎక్కువగా మంజీరా పరివాహక ప్రాంతంలో ఉంది. దీంతో ఇక్కడ రైతులు వరి సాగునే ఇష్టపడుతున్నారు. మండలంలోని మంజీరా పరివాహక ప్రాంతాల్లోని రైతులు గతంలో వరి సాగులో అధిక దిగుబడి సాధించారు. దీంతో వారు ఇప్పుడు కూడా వరి సాగుకే మొగ్గుచూపుతున్నారు.

☛ మండలంలో ఈ సీజన్లో 1,500 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మరికొందరు రైతులు తక్కువ మొత్తంలో కూరగాయాలు, ఆకుకూరలు సాగు చేస్తున్నారు.

చిలప్‌చెడ్‌లో వానాకాలం సీజన్‌లో పెరుగుతున్న వరి సాగు

సంవత్సరం	ఎకరాలు
2020	9650
2021	10,445
2022	11,700
2023	12,200 అంచనా

భూసారంతో సంబంధం లేని పంటలు :

☛ గతంలో వ్యవసాయాధికారులు రైతుల పొలాలకు వెళ్లి వారి భూమిని పరీక్ష చేసి, వాటి ఫలితాలను కూడా రైతులకు అందజేసేవారు. వారికి ఈ విషయంలో తగు సూచనలు, సలహాలు ఇచ్చేవారు.

☛ రైతులు నేల సారాన్ని బట్టి తగిన పంటలు వేయాలని, దీంతో పంట దిగుబడి సాధించగలరని అధికారులు చెప్పినా రైతులు వారి మాటలను పట్టించుకోవడం లేదు.

వరినాట్లకే మొగ్గు



వరిసాగు సులభం. దీంతో నాకున్న ఆరు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాను. ప్రస్తుతం వానాకాలం సీజన్ కావడంతో మొత్తం వరి సాగుకే మొగ్గుచూపాను. నా భూమిలో సాగు నీటి సౌకర్యం ఉండడంతో ఈ సీజన్లో ఢోకా ఉండదు.

–గొట్టం గోవిందు, రైతు, చిలప్‌చెడ్

అవగాహన కల్పించాం



మండలంలోని అన్ని గ్రామాల రైతులకు పంట మార్పిడిపై అవగాహన కల్పించాం. నీటి వనరులు లేని రైతులకు ఆరుతడి పంట సాగు చేయాలని సూచించాం. భూసారాన్ని బట్టి నేలలో ఉన్న పోషకాలను వినియోగించుకుని వాటికి తగ్గ పంటలు సాగు చేయాలని రైతులకు సూచించాం. కొంతవరకు మా ప్రయత్నాలు ఫలించాయి.

– బాల్‌రెడ్డి, ఏఓ

మట్టి అక్రమ తవ్వకాలు చేపడితే చర్యలు

- తహసీల్దార్ తులసీరాం
- రెండు ట్రాక్టర్లు, జేసీబీ సీజ్

అల్లాదుర్గం(మెదక్): మట్టి అక్రమ తవ్వకాలపై రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను తహసీల్దార్ సీజ్ చేశారు. ఈ సంఘటన అల్లాదుర్గంలో శనివారం సాయంత్రం జరగగా, ఆదివారం వివరాలు తెలిశాయి. అల్లాదుర్గం శివారులో జేసీబీతో తవ్వి ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తున్నారు. ఈ విషయాన్ని స్థానికులు రెవెన్యూఅధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన తహసీల్దార్ తులసిరాం రెండు ట్రాక్టర్లు, జేసీబీని సీజ్ చేసి అల్లాదుర్గం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఇంటి నిర్మాణ నిమిత్తం..

ఐబీ చౌరస్తాలో గిరిజనుడు ఇల్లు కట్టుకోవడానికి మట్టి తరలించినట్లు అధికారులతో వాపోయాడు. పేద కుటుంబానికి చెందిన తను ఇంటి నిర్మాణానికి మట్టి అవసరం ఉందని తరలించినట్టు చెప్పాడు. ఇంటి నిర్మాణానికి ఎక్కడి నుంచి తెచ్చుకోవాలని అతను అధికారులను ప్రశ్నించాడు. అల్లాదుర్గంలోని తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే భారీ ఎత్తున ఎలాంటి అనుమతి లేకుండా గుట్టలు, గుట్టలుగా మట్టి నిల్వ చేసుకుంటే ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని బాధితుడు ప్రశ్నించాడు. కొందరు అక్రమంగా 20, 30 ట్రాక్టర్లతో మట్టి తవ్వకాలు చేపడుతుంటే చర్యలు తీసుకోక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పేద గిరిజనుడు ఇంటి కోసం మట్టిని వాడుకుంటే చర్యలు తీసుకోవడంపై అధికారుల తీరును కొందరు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ విషయంలో స్పందించి తన ఇంటి నిర్మాణానికి సహకరించాలని కోరాడు.

వేంకటేశ్వరాలయంలో హుండీ చోరీ

నంగునూరు(సిద్దిపేట): కోనాయిపల్లిలోని వేంకటేశ్వరాలయంలో శనివారం రాత్రి దొంగలు హుండీని ఎత్తుకెళ్లారు. వివరాలు ఇలా ఉన్నాయి..వేంకటేశ్వరాలయంలోని ఉత్తర ద్వారం గుండా లోపలికి వచ్చిన దొంగలు హుండీని ఎత్తుకెళ్లి సమీపంలోని మామిడి తోటలో హుండి పగులగొట్టారు. అందులోంచి చిల్లర డబ్బులు వదిలేసి నగదు ఎత్తుకెళ్లారు. రోజూ మాదిరిగా ఆదివారం ఉదయం పూజ చేసేందుకు వచ్చిన ఆలయ పూజారి బ్రమ్మదేవ్ త్రిపాఠి హుండి కనబడక పోవడంతో గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం అందజేశాడు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమని తెలిపారు.


ఆలయంలో వివరాలు సేకరిస్తున్న ఏఎస్ఐ


వదిలేసిన హుండీని పరిశీలిస్తున్న పోలీసులు

మరో హుండీ భద్రం..

ఆయలంలో ఉన్న మరో హుండీని ఎత్తుకెళ్లేందుకు విఫలయత్నం చేసిన దుండగులు బరువు ఎక్కువగా ఉండడంతో అక్కడే వదిలేశారు. దొంగతనం జరిగిన విషయం తెలుసుకున్న ఆలయ కమిటీ సభ్యులు గుడిలోని రెండో హుండీని తెరిచి లెక్కించారు. అందులో రూ.35వేలు ఉన్నాయని తెలిపారు. నాలుగు నెలలుగా ఈ హుండీలను తెరవలేదని, ప్రధాన హుండీలో పెద్ద మొత్తంలో డబ్బులు ఉండొచ్చని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

వెల్కటూరులో గుడి తాళాలు పగులగొట్టి..

సిద్దిపేటఅర్బన్: గుడి తాళాలు పగులగొట్టి హుండీలో డబ్బులతో పాటు, వెండి వస్తువులు, సీసీ కెమెరాల బాక్సులు ఎత్తుకెళ్లారు. గ్రామస్తులు, త్రీటౌన్ సీఐ భానుప్రకాశ్ తెలిపిన వివరాల ప్రకారం..గ్రామంలోని వీరభద్రస్వామి దేవాలయం, పోచమ్మ దేవాలయంలో శనివారం అర్ధరాత్రి బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు గుడి తాళాలు పగులగొట్టి హుండీలను ఎత్తుకెళ్లారు. దీంతో పాటు వెండి వస్తువులు, సీసీ కెమెరాల బాక్సులు, పవర్ సప్‌లై బాక్సులను అపహరించారు. ఒక హుండీలో రూ.30వేలు, మరో హుండీలో రూ.10వేలు కానుకల రూపంలో వచ్చాయని తెలిపారు. వీరభద్రస్వామి దేవాలయం వద్ద హుండీని ఎత్తుకెళ్లిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. వీరభద్రస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ శివప్రసాద్, పోచమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ నర్సింలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దాంపత్య జీవితానికి అడ్డు వస్తుందని..

హత్నూర(సంగారెడ్డి): దాంపత్య జీవితానికి అడ్డుగా మారిందని మహిళలపై పెట్రోల్ పోసి హత్య చేసిన సంఘటన నల్లవల్లి అటవీ ప్రాంతంలో ఆదివారం వెలుగు చూసింది. జిన్నారం సీఐ వేణు కుమార్, హత్నూర ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..హత్నూర మండలం బడంపేటకు చెందిన మల్లమ్మను (37)అదే మండలం పన్యాలకు చెందిన గొర్రెలకాడి మొగులయ్యతో గత 20 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి 16ఏళ్ల కూతురు ఉంది. బతుకుదెరువు కోసం గతంలో దంపతులిద్దరూ గుమ్మడిదల మండలం మంబాపూర్‌లోని ఓ కోళ్ల ఫారంలో కొన్నినెలల పాటు పనిచేశారు. అనంతరం స్వగ్రామానికి వచ్చారు. అక్కడ పనిచేస్తున్న క్రమంలో శివంపేట మండలం చిన్న గొట్టుముక్కల గ్రామానికి చెందిన మహమ్మద్ ఖాజాతో మల్లమ్మకు వివాహేతర సంబంధం ఏర్పడింది. స్వగ్రామానికి చేరుకున్న తరువాత కొన్ని రోజులకు మల్లమ్మ భర్త మొగులయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ క్రమంలో మల్లమ్మ మహమ్మద్ ఖాజా ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతోంది. మహమ్మద్ ఖాజా భార్యకు వివాహేతర సంబంధం గురించి తెలియడంతో భర్తను పలుమార్లు మందలించింది. దీంతో ఇద్దరి మధ్య గొడవలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో మల్లమ్మను ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని ఓ పథకం వేసుకున్నాడు. పథకంలో భాగంగా ఈ నెల 3న మహ్మద్ ఖాజా మల్లమ్మకు ఫోన్ చేసి నర్సాపూర్ పిలిపించుకున్నాడు. అక్కడికి చేరుకున్న ఆమెను స్కూటీపై నల్లవల్లి అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం మల్లమ్మను చున్నీతో బిగించి హత్య చేసి ఆనవాళ్లు దొరక్కుండా వెంట తెచ్చుకున్న పెట్రోల్ పోసి పరారయ్యాడు. తన కూతురు కనిపించకపోవడంతో మల్లమ్మ తల్లి అంజమ్మ ఈ నెల 4న హత్నూర పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. దర్యాప్తులో భాగంగా నల్లవల్లి అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం కావడంతో పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టి మొహమ్మద్ ఖాజాను అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ విచారణలో తను హత్యానేరాన్ని ఒప్పుకోవడంతో నిందితుడు మహమ్మద్ ఖాజాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత అదృశ్యం

నర్సాపూర్‌రూరల్: వివాహిత అదృశ్యమైన సంఘటన నర్సాపూర్ మండలం రంజాతండాలో చోటు చేసుది. నర్సాపూర్ ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం..చిప్పల్‌తుర్తి గ్రామం రంజాతండాకు చెందిన ఇస్లావత్ శాంతి జూన్ 29న పెద్ద కొడుకు ప్రసాద్‌తో గొడవపడి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు బంధువుల వద్ద, చుట్టుప్రక్కలా, వెతికినా ఆచూకీ లభించలేదు. శాంతి కుమారుడు మోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బోరు మోటార్ చోరీ

శివ్వంపేట(నర్సాపూర్): వ్యవసాయ పొలం వద్ద బోరు మోటారుని దొంగిలించిన సంఘటన దొంతి గ్రామ శివారులో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. దొంతి గ్రామానికి చెందిన రైతు పానగారి యాదగిరి తన వ్యవసాయ పొలం వద్ద వాగులో నుంచి నీటిని తోడేందుకు 5 హెచ్‌పీ కరెంటు మోటార్ ఏర్పాటు చేశాడు. దీంతో ఇక్కడ గత కొన్ని రోజుల నుంచి తన పొలం పక్కన నిర్మానుష ప్రాంతంలో కొందరు పేకాట ఆడుతున్నారని వారే తన మోటారును దొంగలించిఉండొచ్చని ఆరోపించారు. నిత్యం పలు ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడికి వచ్చి మద్యం సేవిస్తూ పేకాట ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. వారే బావి వద్ద ఉన్న మోటార్‌ను దొంగిలించి ఉండొచ్చని రైతు ఆరోపిస్తున్నాడు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధిత రైతు తెలిపాడు.


పేకాట ఆడుతున్న దృశ్యం

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

పటాన్‌చెరు టౌన్: పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్ఐ రామానాయుడు కథనం ప్రకారం..పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఏడుగురు పరారీలో ఉన్నారు. వారి వద్ద నుంచి రూ.89వేలు నగదు, ఆరు సెల్ ఫోన్‌లు, ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదంలోముగ్గురి మృతి

వేర్వేరు సంఘటనల్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. కొండపాకలోని కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ సమీపంలో జరిగిన సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పాపన్నపేట మండలం అన్నారం శివారులో ఆటో బోల్తాపడ్డ సంఘటనలో ముగ్గురు మహిళా కూలీలకు తీవ్రగాయాలయ్యాయి. కొడిపల్లిలో కొడుకు మృతి చెందగా తల్లికి తీవ్ర గాయాలయ్యాయి.

కొడిపల్లి(నర్సాపూర్): బంధువు అంత్యక్రియలకు వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో కొడుకు మృతి చెందాడు. తల్లికి తీవ్ర గాయాలైన సంఘటన కొడిపల్లి మండలం నాగ్సాన్‌పల్లి శివారులో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..చిలప్‌చెడ్ మండల పరిధిలోని బట్టుతండాకు చెందిన రుడావత్ గోప్యా(38) తన తల్లి రంకీబాయితో కలిసి శివ్వంపేట మండలం కొత్తపేట గ్రామంలో బంధువు అంత్యక్రియలకు వెళ్లివస్తుండగా నాగ్సాన్‌పల్లి వద్ద ఎదరుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తల్లి రంకీబాయి చేయి తెగిపడడంతో పాటు, కాలు విరిగింది. గోప్యాకు తీవ్ర గాయాలవడంతో ఇరువురిని నర్సాపూర్ ఆసుపత్రికి తరలిస్తుండగా గోప్యా మార్గమధ్యలో మృతి చెందాడు. రంకీబాయి పరిస్థితి విషమంగా ఉంది.


మృతదేహం వద్ద రోదిస్తున్న భర్త బాబులాల్

కంది(సంగారెడ్డి): లారీ స్కూటీ ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన కందిలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ రాజేశ్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం..రాజస్థాన్‌కు చెందిన బాబులాల్, సువదేవి కొన్నేళ్లుగా కొండాపూర్ మండలంలోని మల్కాపూర్‌లో నివాసముంటున్నారు. ఆదివారం ఉదయం మల్కాపూర్ నుంచి హైదరాబాద్‌లోని మణికొండ వెళ్లేందుకు స్కూటీపై దంపతులిద్దరూ బయలు దేరారు. కంది చౌరస్తా దాటుతుండగా వెనుకనుంచి లారీ స్కూటీని ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కూటీ వెనుక కూర్చున్న సువదేవి(55)కింద పడిపోవడంతో ఆమెపైనుంచి లారీ టైర్లు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుమారుడు కుమావథ్ కైలాశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


సానియాసింగ్ మృతదేహం

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

హత్నూర (సంగారెడ్డి): గుర్తు తెలియని వాహనం ఢీకొని కార్మికుడు మృతి చెందాడు. హత్నూర పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఒడిశా రాష్ట్రం, మయూరి జిల్లా బాహ్మణిపాత గ్రామానికి చెందిన సానియా సింగ్ (33) గత రెండు నెలలక్రితం మండలంలోని గోవిందరాజు పల్లి శివారులోని ఆర్‌అండ్ ఇండస్ట్రీలో కార్మికుడిగా పనిలో చేరాడు. శనివారం సెలవు తీసుకున్న సానియాసింగ్ రాత్రి ఎస్ఎస్ఆర్ సమీపంలోని దాబా హోటల్ వద్దకు భోజనం చేయడానికి రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తోటి కార్మికులు అక్కడికి చేరుకొని మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అదే పరిశ్రమలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న బాబి మోహన్ పత్ర ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని..


కొండపాక(గజ్వేల్): రాజీవ్ రహదారిపై బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ సమీపంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న నసుపుటి సాయి, మిద్దె రఘు, బందగి వెంకటేశ్ రాజీవ్ రహదారిపై బ్రిడ్జి వద్ద డివైడర్‌ను వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న సాయి తలకు బలమైన గాయమవ్వగా, రఘుకు ఎడమకాలు, చేయి విరిగాయి. వెంకటేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దీన్ని గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో సాయి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు పేర్కొన్నారు.


గాయపడిన సాయి


మిద్దె రఘు

ఆటో బోల్తాపడి..

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట మండలం అన్నారం శివారులో ఆటో బోల్తాపడ్డ సంఘటనలో ముగ్గురు మహిళా కూలీలకు తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి..అన్నారం గ్రామానికి చెందిన కూలీలు వరినాట్లు వేయడానికి ఆదివారం ఆటోలో వెళ్లి తిరిగి వస్తుండగా అన్నారం శివారులో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న మరియమ్మ, పోచమ్మ, సురేఖలకు గాయాలయ్యాయి. చికిత్సనిమిత్తం వీరిని మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


గాయపడ్డ పోచమ్మ